


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
సోమవారం 14-7-2025
సంపుటి: 21 సంచిక: 95
పేజీలు: 8 వెల: రూ.1

# ఇగోల బందిఖానాలో వైకాపా!

- ఓటమి భారం నుంచి ఏడాదిలోనే కోలుకున్న పార్టీ
- పెద్ద నేతలు మాత్రం ఇంకా పాత ధోరణిలోనే..
- ఆమదాలవలస సభకు పార్లమెంటరీ ఇన్‌ఛార్జి తమ్మినేని డుమ్మా
- శ్రీకాకుళం కార్యక్రమానికి ఆయన్ను ఆహ్వానించని ధర్మాన
- పార్టీ వీడటం లేదని ఆయన చెప్పడం ఒక్కటే ఉపశమనం

బిడ్డ చచ్చినా పురిటి కంపు వదల్లేదు.. చింత చచ్చినా పులుపు చావలేదు.. ప్రతిపక్ష వైకాపా విషయంలో ఇలాంటి ఎన్ని నానుడులు చెప్పకున్నా తక్కువే. ప్రభుత్వ పక్షం రాష్ట్రవ్యాప్తంగా వైకాపా నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధిస్తున్నా జిల్లాలో మాత్రం వైకాపా నాయకుల్లో జోష్ పెరిగిందనే చెప్పాలి. విద్యుత్ బిల్లుల పెంపు తర్వాత వైకాపా చేపట్టిన ప్రతి కార్యక్రమం జిల్లాలో విజయవంతమైంది. కేసులకు సైతం వెరవకుండా క్యాడర్ ముందుకొస్తోంది. కానీ పదవులు అనుభవించి పెద్ద నాయకులుగా చెలామణీ అవుతున్నవారు మాత్రం ఇగోలకు పోవడంతో పార్టీకి ఇంకా బుద్ధి రాలేదన్న సంకేతాలు వెళ్తున్నాయి.


ఆమదాలవలసలో సీతారామ్ లేని వేదిక నుంచి అభివాదం చేస్తున్న చింతాడ రవి


ధర్మాన బంగ్లాలో జరిగిన బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ స్టిల్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన నేపథ్యంలో ప్రతి నియోజకవర్గంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం చేపట్టాలని, నాయకులందరూ కలసికట్టుగా నిర్వహించాలని పార్టీ ఆదేశించింది. అందులో భాగంగా ముందుగా నియోజక వర్గాల స్థాయిలో దీనిపై సమావేశాలు జరపాలి. ఇక్కడే పెద్ద తలకాయల మధ్య భేదాభిప్రాయాలు బయట పడ్డాయి. ఆమదాలవలస నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జిగా ఉన్న చింతాడ రవికుమార్ ఈ కార్యక్రమం నిర్వహిస్తే పార్లమెంట్ ఇన్‌ఛార్జి తమ్మినేని సీతారామ్ డుమ్మా కొట్టారు. అదే రోజు పలాసలో డాక్టర్ సీదిరి అప్పలరాజు నిర్వహించిన కార్యక్రమంలో కనిపించారు. వాస్తవానికి చింతాడ రవిని మొదటి నుంచి ధర్మానతో పాటు తెర వెనుక బలంగా ప్రోత్సహిస్తున్నది సీదిరి అప్పలరాజేనన్న భావన అధికారంలో ఉన్నన్నాళ్లూ సీతారాంకు ఉండేది. అటువంటిది ఇప్పుడు చింతాడ రవి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అయ్యేసరికి సీదిరి కంటే సొంత నియోజకవర్గంలో ఉన్న రవి కుమార్ వల్లే తనకు ఎక్కువ ప్రమాదమని భావించిన సీతారాం పార్లమెంట్ ఇన్‌ఛార్జి హోదాలో పలాసకు వెళ్లిపోయారు. వాస్తవానికి ఆమదాలవలస సభలోనే సీతారాం పాల్గొనాల్సిన ఆవశ్యకత ఉంది. కానీ తాను లేకుండా రవికుమార్‌కు సొంతంగా ఎంత బలముందో పార్టీకి తెలియాలన్న కోణంలో సీతారాం పలాస వెళ్లిపోయారు. కానీ చింతాడ రవి కార్యక్రమానికి భారీగానే పార్టీ నాయకులు వచ్చారు.

### ఇక్కడ కాదని అక్కడికి తమ్మినేని

కట్ చేస్తే.. రెండు రోజుల క్రితం శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు ఇలాంటి కార్యక్రమమే నిర్వహించారు. ఈ సమావేశానికి శ్రీకాకుళం పార్లమెంట్ ఇన్‌ఛార్జి తమ్మినేని సీతారాంకు ఆహ్వానం లేదు. వేదికపై ఆయన కనిపించనూ లేదు. జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు మాత్రమే హాజరయ్యారు. శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించిన కార్యక్రమం కాబట్టి సీతారామ్‌ను పిలిచి ఉండకపోవచ్చని భావిస్తే అది పూర్తిగా సమర్ధనే అవుతుంది. ఎందుకంటే.. జిల్లా పార్టీ అధ్యక్షుడు, పార్లమెంట్ పార్టీ పరిశీలకుడు వచ్చినప్పుడు పార్లమెంటు ఇన్‌ఛార్జి కూడా ఉండాలి. ఇక సీతారాం, ధర్మాన ప్రసాదరావుల మధ్య గ్యాప్ ఉన్న విషయం అందరికీ తెలిసిందే. 2019 ఎన్నికల తర్వాత ధర్మాన ప్రసాదరావు ఎమ్మెల్యేగా మిగిలిపోతే స్పీకరైన సీతారాం శ్రీకాకుళం నియోజకవర్గంలో విస్తృతంగా చొరబడ్డారు. ఆ సమయంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న కృష్ణదాస్ కూడా అడ్డుకునే ప్రయత్నం చేయలేదన్న భావన ధర్మానకు ఉండేది. ఇలా చెప్పుకుంటూపోతే ఒకే పార్టీలో ఉన్నా, ఒకే నియోజకవర్గం కాకపోయినా రాజకీయ పదవుల దగ్గరకొచ్చేసరికి వీరంతా ప్రత్యర్థులే. ధర్మాన ఇక్కడ సమావేశం నిర్వహించిన రోజునే టెక్కలిలో వైకాపా ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ఆహ్వాన ఫ్లెక్సీల్లో ఎక్కడా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఫొటో కనపడలేదు. ఈ విషయం తెలుసుకున్న తిలక్ వెంటనే అప్పలరాజుకు ఫోన్ చేసి కార్యక్రమానికి హాజరవ్వాలని కోరారు. అప్పలరాజు కూడా అంతే గౌరవంతో కార్యక్రమానికి వచ్చారు. సభాముఖంగానే జరిగిన పొరపాటుకు తిలక్ అప్పలరాజుకు క్షమాపణ చెప్పారు. ఇదే వేదిక మీద సీతారాం, ధర్మాన కృష్ణదాస్, కుంభా రవిబాబుతో పాటు అందరూ కనిపించారు. అసలు ఈ కార్యక్రమాలను కోఆర్డినేట్ చేస్తున్నది ఎవరు? జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కృష్ణదాస్ ఏ రోజు ఏ నియోజకవర్గంలో సమావేశం పెట్టాలి? అనేది నిర్ణయించాలి. ఇందుకోసం పార్లమెంట్ పరిధిలో నాయకులుగా ఉన్న తమ్మినేని సీతారాం, కుంభా రవిబాబులతో కూర్చోవాలి. ఇలా కాకుండా ఒకేరోజు రెండు నియోజకవర్గాల్లో సమావేశాలు పెడితే ఆమదాలవలసకు వెళ్లకుండా పలాసకు, శ్రీకాకుళంలో కనపడకుండా టెక్కలిలో ప్రత్యక్షమవడానికి సీతారామ్‌కు


టెక్కలి వేదిక మీద సీదిరి అప్పలరాజు


సన్‌రైజ్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో బొత్స

అవకాశం దొరికినట్టే. దీనివల్ల ధర్మాన ప్రసాదరావు లాంటి నాయకులకు కూడా అవకాశం లభిస్తుంది. పార్లమెంటరీ పార్టీ ఇన్‌ఛార్జికే శ్రీకాకుళం సమావేశానికి ఆహ్వానం లేకపోవడం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. ఆమదాలవలస సమావేశానికి సీతారాం ఎందుకు వెళ్లలేదు అని ప్రశ్నించే అవకాశం కూడా పార్టీకి లేకుండా అదే రోజు పలాస మీటింగ్ పెట్టించి అక్కడికి వెళ్లిపోయారు.

### బొత్స రాకతో అప్రమత్తమయ్యారా?


ధర్మాన ప్రసాదరావు పెట్టిన డిమాండ్లను పార్టీ ఒప్పుకుందో, లేదంటే పక్క జిల్లా నుంచి బొత్స సత్యనారాయణ, ఈ జిల్లా నుంచి సీదిరి అప్పలరాజు వంటి నేతలతో ప్రమాదం పొంచి ఉందని భావించారో ఏమో తెలీదు గానీ.. పార్టీ ఓడిపోయిన తర్వాత తొలిసారిగా పార్టీ నాయకులను ధర్మాన ప్రసాదరావు మొన్న అడ్రస్ చేసి మాట్లాడారు. 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్న పిలుపుతో పాటు తాను పార్టీ మారడంలేదని, ఒకవేళ మారితే మొత్తం కట్టగట్టుకొని వెళ్లిపోతాను గానీ, తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా రాజకీయాలు నెరిపిన తాను ఆపార్టీలోకి వెళ్లలేనని ధర్మాన స్పష్టం చేయడం కార్యకర్తల్లో ఇన్నాళ్లూ నెలకొన్న సందిగ్ధాన్ని తొలగించింది. తాను పార్టీ మారుతున్నానంటూ మీడియాలో కథనాలు వస్తున్నాయని ధర్మాన చెప్పుకొచ్చారు. వాస్తవానికి ఆ ప్రచారం చేసింది వైకాపా నేతలు.. అందుకు అవకాశం కల్పించింది

- మిగతా చివరి పేజీలో

## ఉద్యోగ బాంధవుడు డీవీ రమణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డీ.వి.రమణ ఉద్యోగ బాంధవుడని ఎంపీ.కలిశెట్టి, చౌదరి పురుషోత్తం నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై సంపూర్ణ అవగాహన వున్న వ్యక్తిగా డీ.వీ.రమణ నూతనంగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఉద్యోగుల సమస్యలు వివరించి, వారి సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి రమణ కృషి చేయాలని కోరారు.



## నిందితులను కఠినంగా శిక్షించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా నాయకుడు సత్తారు గోపి హత్య ఘటనలో సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ కోరారు. ఈమేరకు సోమవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిష్పాక్షిక దర్యాప్తు చేసి బాధ్యులను త్వరగా అరెస్ట్ చేయాలని కోరారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ హత్య జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. నిందితులను వదిలిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు విభాగం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో భయం తొలగాలంటే వెంటనే న్యాయం జరగాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ , జిల్లా ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు



## వీధిలైట్లు ఏర్పాటు కోసం వినతి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం కార్పొరేషన్ లో విలీనమైన తోటపాలెం 38 వ డివిజన్ ఫరిధిలోని ఎస్‌ఏటి నగర్ నుండి తోటపాలేం వరకు గల రహదారిపై నూతన వీధిలైటులను ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బలగ మోహన్‌రావు మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. 38వ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులు, కాలనీల్లో వీధిలైట్లు పాడవడంతో నగరం నుంచి గ్రామానికి రాత్రివేళల్లో వస్తున్న విద్యార్థులు, మహిళలు, ద్విచక్ర వాహనదారులు వెలుతురు లేక తీవ్ర అసౌకర్యాన్ని గురవుతున్నారన్నారు. అదే విధంగా ఎస్సీ కాలనీలో దుర్భర స్థితిలో ఉన్న రోడ్లు కాలువలను నూతనంగా నిర్మించాలని కమిషనర్‌ను కోరారు. వీటికి స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని సంఘం సభ్యులు బలగ తేజేశ్వరరావు, ఎం. వేణు, కె. రాము, చిన్న తదితరులు తెలిపారు.

## ఏడాదిలోనే ఎంతో అభివృద్ధి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలు తెలుసుకోవడమే 'సుపరిపాలనలో తొలి అడుగు' లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని 27, 28, 29 డివిజన్ల పరిధిలోని ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, తొలి ఏడాది సాధించిన అభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో అధిక శాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసినందున ధైర్యంగా 'తొలి అడుగు' కార్యక్రమం ద్వారా ప్రజల మధ్య వచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోనల్ ఇన్‌ఛార్జి పిల్లా కోటి శ్రీనివాసరెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు, వార్డు ఇన్‌ఛార్జీలు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## విరివిగా రక్తదానం చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం టౌన్)

జిల్లాలో రక్తం కొరత తీవ్రంగా ఉందని రెడ్‌క్రాస్ ఎమ్‌సీ సభ్యుడు కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. రెడ్‌క్రాస్ ప్రతినిధి, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ వ్యవస్థాపకుడు నంది ఉమాశంకర్ జన్మదినం సందర్భంగా సోమవారం రెడ్‌క్రాస్ కార్యాలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ రక్తం కొరత కారణంగా అవసరమైన వారికి రక్తం అందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా, లుకేమియా వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు పునర్జన్మ ప్రసాదించడానికి రక్తదాతలు ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ చైర్మన్ సూచనల మేరకు కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, బంగారు పతకాలు అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పీఆర్వో పెంకి చైతన్య, బి.జగదీశ్, హర్ష, రెడ్‌క్రాస్ రక్తనిధి మేనేజర్ అయేషాబేగం, ఆఫీస్ మేనేజర్ సతీష్, ట్రైనింగ్ మేనేజర్ జి.రమణ, ఆదిత్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎంఎస్ గుప్తా, వ్యాయామ ఉపాధ్యాయుడు వీరఘట్టం శైల పద్మరాజులు పాల్గొన్నారు.



## దొరికిన విగ్రహాల విధ్వంసకారుడు

- జి.సిగడాం కేసులో నిందితుడి అరెస్టు
- తాగిన మత్తులో దాడి చేసినట్లు వెల్లడి
- విలేకరులకు వెల్లడించిన జిల్లా ఎస్పీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆలయంలో విగ్రహాల ధ్వంసం కేసులో పోలీసులు ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. నిందితుడిని సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఈ కేసు వివరాలు వెల్లడించారు. జి.సిగడాం మండలం డీఆర్(దాలంరాజు) వలస గ్రామంలో శివాలయం పక్కనున్న నవగ్రహ ఆలయంలోకి ఈనెల 11న రాత్రి ప్రవేశించిన దుండగులు నవగ్రహ విగ్రహాలను ధ్వంసం చేశారన్నారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జి.సిగడాం పోలీసులు దర్యాప్తు జరిపి.. రామకృష్ణ అనే వ్యక్తిని నిందితుడిగా గుర్తించారు. నిందితుడిని సోమవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ నెల 11న రాత్రి రామకృష్ణ మద్యం సేవించి శివాలయం వద్దకు వెళ్లాడు. తన జీవితం పోయిందంటూ దేవుళ్లను దూషించడం మొదలు పెట్టాడు. మద్యం మత్తులో అక్కడే ఉన్న ఇనుప రాడ్డు తీసుకుని నవగ్రహ ఆలయంలోకి వెళ్లాడు. తనకు శని పట్టుకుందని వాపోతూ అక్కడ ఉన్న తొమ్మిది గ్రహదేవతల విగ్రహాలను ఇనుపరాడ్డుతో ధ్వంసం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలిందన్నారు. ఆ మేరకు రామకృష్ణను అరెస్టు చేసినట్లు చెప్పారు. కేసును స్వల్ప వ్యవధిలోనే పరిష్కరించిన డీఎస్పీ వివేకానంద, జె.ఆర్.పురం సీఐ అవతారం, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ పైడపు నాయుడు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, ఇన్‌స్పెక్ట(వి.ఆర్,) రమణమూర్తి, సబ్ ఇన్‌స్పెక్టర్లు మధుసూదనరావు, సత్యనారాయణ, గణేష్, సీసీఎస్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, క్లూస్ టీమ్ ఎస్సై భరత్, ఇతర సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## బాలి యాత్రకు సన్నాహాలు

(సత్యంన్యూస్, జలుమూరు)

ప్రాచీన కళింగసీమ రాజధాని శ్రీముఖలింగములో బాలియాత్ర 2025 కార్యనిర్వాహక కమిటీ సోమవారం సమావేశమైంది. ఈ సంవత్సరం కార్తీక పౌర్ణమి నాడు జరగబోయే బాలియాత్ర 2025 నిర్వహించే విధానాల కోసం ఇటీవల ఏర్పాటైన బాలియాత్ర 2025 ఉత్సవ కమిటీ చర్చించారు. బుధవారం నవంబర్ 5 న కార్తీక పౌర్ణమి నాడు లాంఛనంగా ప్రారంభమయ్యే ఈ బాలియాత్ర కార్తీక మాసంతం వరకు పక్షం రోజులపాటు కొనసాగుతుందని, నవంబర్ 9వ తేదీ ఆదివారం విశిష్ట దీపోత్సవం జరుగుతుందని బాలి యాత్ర నిర్వాహక కమిటీ 2025 ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని కళింగసీమలోని ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని, తమ పూర్వీకుల ఆత్మకి శాంతిని చేకూర్చి, తమ పెద్దల ఆశీర్వాదాలను మన వంశజుల అభివృద్ధికి అందించేందుకు, మన ప్రాంత పురోభివృద్ధికి తోడ్పడేలా ప్రజలంతా పాల్గొని మన పూర్వీకుల సంప్రదాయమైన ఈ బాలియాత్రని విజయవంతం చేయాలని కార్యనిర్వహక కమిటీ పిలుపునిచ్చింది.



• ఎడిటోరియల్

# దేశంలో 35 కోట్ల ఆకలికేకలు!

ప్రపంచంలో శరవేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం అగ్రస్థానంలో ఉందని నివేదికలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు పేర్కొంటున్నాయి. అందుకు తగినట్లే మన దేశం ఇప్పటికే జర్మనీని వెనక్కి నెట్టి ప్రపంచంలోని నాలుగు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. త్వరలోనే అమెరికా, చైనా తర్వాత మూడో స్థానానికి ఎదిగే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ నివేదికలు అంచనా వేస్తున్నాయి. గణాంకాలు, కాగితాల్లో విశ్లేషణలు ఎంతో ఘనంగా కనిపిస్తుంటే.. దీనికి మరో కోణాన్ని మరికొన్ని విశ్లేషణలు ఆవిష్కరిస్తున్నాయి. దేశ జనాభాలో సమారు మూడోవంతు ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం దేశ జనాభా 140 కోట్లు పైగానే ఉంది. ఇందులో 35 కోట్ల మంది అర్ధాకలి జీవితాలు వెళ్లదీస్తున్నారని ఈ నివేదిక పేర్కొంది. ఆర్థిక వ్యవస్థ ఆకాశమంత ఎత్తు ఎదుగుతున్నా.. పేదలు పేదల్లానే ఉంటున్నారంటే.. మన పాలకులు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు, వాటి ఫలితాలు పేదల వరకు చేరకపోవడమో లేదా విఫలం కావడమో జరుగుతోందన్నది నిష్ఠుర సత్యంగా గుర్తించకతప్పదు. అట్టడుగు వర్గాల ప్రజల జీవితాలను మెరుగుపరచడంతో ప్రభుత్వాలు వెనుకబడ్డాయని ఈ నివేదికలు చెప్పకనే చెబుతున్నాయి. పేదరిక నిర్మూలనకు దశాబ్దాలుగా భారత ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది. పథకాలు అమలుచేస్తోంది. ఈ విషయంలో మంచి పురోగతి సాధిస్తుండటం వల్ల పెద్ద సంఖ్యలో పేదలు దారిద్ర్య రేఖను దాటి ఎగువకు వస్తున్నప్పటికీ.. అంతకుమించి పెరుగుతున్న జనాభా వృద్ధిరేటను డామినేట్ చేస్తోంది. ఫలితంగా ఇప్పటికీ పేదరికం తాండవిస్తోంది. దేశ జనాభాలో ప్రతి నలుగురిలో ఒకరు కనీస జీవన ప్రమాణాల కంటే దిగువనే గడుపుతున్నట్లు ప్రపంచ బ్యాంక్ తన నివేదికలో పేర్కొంది. అంటే 35 కోట్ల ప్రజలు కనీస అవసరాలు తీర్చుకోవటంలో ఇబ్బంది పడుతున్నట్లు ఈ నివేదిక చెబుతోంది. అలా అని వారందరూ కటిక పేదరికంలో మగ్గుతున్నట్లు చెప్పలేం.. కానీ ఇల్లు, వైద్యం, విద్య, బలవర్ధకమైన ఆహారం వంటి కనీస అవసరాలను సమకూర్చు కోవడంలో మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నది వాస్తవమని ప్రపంచ బ్యాంక్ నివేదిక తేల్చింది. 2011 నుంచి ప్రభుత్వాలు చేపట్టిన అనేక కార్యక్రమాలు మనదేశంలో పేదరికాన్ని తగ్గించ టానికి కొంత వరకు దోహదపడ్డాయి. అయినా ఇప్పటికీ కోట్లాది మంది పేదరికాన్ని అనుభవిస్తు న్నారు. ప్రపంచ స్థాయిలో రోజువారీ కనీస ఆదాయం మూడు డాలర్లు అంటే భారత కరెన్సీలో రోజుకు రూ.250గా పరిగణిస్తున్నారు. కానీ ఆమాత్రం సంపాదన కూడా లేనివారిని పేదలుగా పరిగణించాలని ప్రపంచ బ్యాంకు ప్రామాణికాలు నిర్దేశిస్తున్నాయి. కానీ ఈ రేటు ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశానికి సరిపోదని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. తాజా ప్రమాణాల ప్రకారం తక్కువ ఆదాయ వర్గాల సగటు రోజువారీ సగటు ఆదాయం 4.2 డాలర్లు అంటే రూ.350 ఉండాలని ఆ బ్యాంకు నిపుణులు పేర్కొంటున్నారు. భారత పొరుగు దేశాలైన శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లలో కూడా 4.2 డాలర్ల రోజువారీ ఆదాయాన్నే ప్రామాణికంగా పరిగణిస్తున్నారు. కొత్త ప్రామాణికాల ప్రకారం రూ.350 రోజువారీ ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకున్నా కూడా భారత్‌లో 35 కోట్ల మంది రోజు వారీ అవసరాలు తీర్చుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారని తేలింది. అయితే భారత్ ప్రపంచ స్థాయి ప్రమాణాలైన మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్‌ను పరిగణనలోకి తీసుకుంటోంది. ఎందుకంటే ఇందులో విద్య, శుభ్రత, విద్యుత్, హౌసింగ్ వంటి అనేక అంశాలను ప్రమాణికాలుగా తీసుకుంటారు. మరోవైపు దేశంలో సంపన్నులు, పేదల మధ్య వ్యత్యాసం ఇంకా ఎక్కువగానే ఉన్నట్లు తేలింది. ఇండియా గినీ సూచీ ప్రకారం దేశ జనాభాలో కేవలం ఒక్క శాతం మాత్రమే ఉన్న సంపన్నుల వద్దే జాతీయ సంపదలో 40 శాతం పేరుకుపోయినట్లు వెల్లడైంది. అదే సమయంలో అట్టడుగున ఉన్న 50 శాతం భారతీయుల చేతిలో కేవలం 6.4 శాతం సంపద మాత్రమే ఉన్నట్లు వెల్లడైంది. పట్టణాలు, నగరాల్లో అధిక అద్దెలు, స్థిరత్వం లేని ఉద్యోగాలు ప్రజలను పేదరికంలోనే నివసించేలా చేస్తున్నాయని వెల్లడైంది. ఇక గ్రామాల విషయానికి వస్తే చిన్న చిన్న కమతాలు, సీజనల్ పనులు ప్రజలకు స్థిరమైన ఆదాయం లేకుండా చేస్తున్నాయని తేలింది. ఈ కారణాల వల్ల సగటు భారతీయ కుటుంబం మెడికల్ ఎమర్జెన్సీ, ఉద్యోగం కోల్పోవటం, వేతనాల్లో ఆలస్యం వంటి సమస్యలు ఎదురైనప్పుడు తట్టుకుని నిలబడటంలో తడబడుతున్నాయని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది.

## కూటమి ప్రభుత్వం బీసీలపై కక్ష కడుతోంది

(సత్యంన్యూస్, విశాఖపట్నం)



రాష్ట్రంలో రోజురోజుకు బడుగు బలహీన వర్గాలపై దాడులు పెరిగిపోతున్నాయని, ఇదే విధంగా దాడులు కొనసాగితే రానున్న రాజుల్లో బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు రానున్నాయని వైకాపా బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ హెచ్చరించారు. ఈమేరకు సోమవారం విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొన్న శ్రీకాకుళం జిల్లాలో బీసీ నేత, ఉప సర్పంచ్ ప్రతినిధి సత్తారు గోపిని హత్య చేసిన ఘటన, నిన్న కృష్ణాజిల్లా జడ్పీ చైర్పర్సన్ ఉప్పాల హారికపై దాడి వంటి ఘటనలతో బీసీలను కూటమి ప్రభుత్వం ఏ రకంగా చూస్తుందో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. ఇప్పటికే సామాన్య పేద మధ్యతరగతి ప్రజలు ఈ ప్రభుత్వాన్ని ఎందుకు గెలిపించామా అని బాధపడుతున్న తరుణంలో ఇటువంటి ఘటనల ద్వారా బీసీలందరూ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బీసీల మీద దాడులు వంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

## గరిమెళ్ళ రచనలు యువతకు ప్రేరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజాకవి గరిమెళ్ళ సత్యనారాయణ తనగళాన్ని, కలాన్ని ఆయుధంగా మలచి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధులని జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ సహాయ సంచాలకులు కె.చెన్నకేశవరావు పేర్కొన్నారు. ప్రజాకవి గరిమెళ్ల సత్యనారాయణ 132 వ జయంతి వేడుకలు సోమవారం శ్రీకాకుళం నగరంలో కిమ్స్ హాస్పిటల్ రోడ్డులో శ్రీకాకుళం జిల్లా జర్నలిస్టుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అతిథులు గరిమెళ్ల సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చెన్నకేశవరావు మాట్లాడుతూ గరిమెళ్ల కళింగాంధ్రుడు కావడం ఎంతో గర్వకారణమన్నారు. మా కొద్దీ తెల్లదొర తనము అన్న గేయాన్ని రచించి జనం గుండెను తట్టి పాలకులు గుండెను కంపింపచేశారన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టుల ఐక్యవేదిక ప్రతినిధులు శాసపు జోగినాయుడు, డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా, ఎంఎవి సత్యనారాయణ, సామాజిక వేత్తలు గేదెల ఇందిరా ప్రసాద్, జి.రాజులు పాల్గొన్నారు.





మండలంలోని లత్సయ్యపేట గ్రామానికి చెందిన సనపల స్నేహంజిలి భద్రాచలం రామాలయంలో భరతనాట్యంతో అలరించింది. ఈ ప్రదర్శన భక్తులకు ఆకర్షణగా నిలిచిందని ఆలయ ధర్మకర్తలు, యాజమాన్యం మెమెంటో ప్రశంస పత్రం, శాలువతో సత్కరించారు.

– సత్యంన్యూస్, పొందూరు

## ఘనంగా గరిమెళ్ళ జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని న్యూబ్రిడ్జి రోడ్‌లో గల గరిమెళ్ళ విగ్రహం వద్ద తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో గరిమెళ్ళ సత్యన్నారాయణ 132వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సభ్యులు గరిమెళ్ళ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రియాగ్రహారంలో జన్మించిన గరిమెళ్ళ అంచెలంచెలుగా ఎదిగి దేశం గర్వించదగ్గ సాహితీ వేత్త కావటం గర్వకారణమన్నారు. ఆయన పాట "మాకొద్దీతెల్లదొరతనం" బహుళ ప్రాచుర్యం పొందిందని తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి రఘుపాత్రుని వెంకట రమణమూర్తి మాట్లాడుతూ కవిగా, రచయితగా, దేశభక్తునిగా ప్రసిద్ధులైన గరిమెళ్ళ స్వాతంత్ర్య సమరంలో పాల్గొని పలుమార్లు జైలుకెళ్లి తన జీవితాన్ని దేశసేవకు అంకితంచేసిన మహనీయుడని కొనియాడారు. భావితరం గుర్తుంచుకునే విధంగా ఆయనకు తగిన గుర్తింపును ఇవ్వాలని ప్రభుత్వానికి, ప్రజాసంఘాలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వావిలపల్లి రాజారావు, భోగెల ఉమామహేశ్వరరావు, డాక్టర్ బి.కోమలరావు, పూడి జనార్ధనరావు, ఐ.యన్.డి.ప్రసాద్, మంగిపూడి శ్రీనివాసరావు, ఇద్దిపాపయ్య, డబ్బీరు గోవిందరావు, కుప్పిలి త్రినాథరావు, బసవ జగన్నాథం, సోడవరం ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## స్విమ్మింగ్‌పూల్ మూత ప్రతిపాదన విరమించుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆగస్టు 10 నుండి స్విమ్మింగ్‌పూల్‌ను మూసియాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవిత్ర, డి.చందులు డిమాండ్ చేశారు. అక్టోబర్‌లో స్కూల్ గేమ్స్ పోటీలు ఉండగా ఆగస్టులో పూల్‌ను మూసివేయడం వల్ల స్విమ్మింగ్ క్రీడాకారులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ గేమ్స్ కాకుండా స్విమ్మింగ్ పూల్ మూసివేయాలని ఏ విధంగా నిర్ణయం తీసుకున్నారని వారు ప్రశ్నించారు. స్విమ్మింగ్ క్రీడాకారులు కొన్ని సంవత్సరాలుగా అధిక మొత్తంలో ఫీజులు చెల్లించి స్కూల్ గేమ్స్ కోసం ప్రాక్టీస్ చేస్తున్నారని, ఇప్పుడు స్విమ్మింగ్ పూల్ మూసివేయడం వారికి శాపంగా మారుతుందన్నారు. ఆగస్టులో స్విమ్మింగ్‌పూల్ మూయడం ద్వారా రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి స్విమ్మింగ్ క్రీడాపోటీలకు శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు దూరమవుతారని, దీని వలన క్రీడాకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న ఏకైక స్విమ్మింగ్ పూలు ద్వారా స్కూల్‌గేమ్స్ సెలక్షన్లు కూడా నిర్వహించే అవకాశం కోల్పోతారని వారు గుర్తు చేశారు. ఆగస్టులో స్విమ్మింగ్ పూల్ మూయలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్విమ్మింగ్ క్రీడాకారులకు ప్రాక్టీస్ చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.




సింహాచలం దేవస్థానంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సోంపేట మహదేవ్‌పేట వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో శ్రీ సుభద్ర కోలాటం ట్రిప్ ఆధ్వర్యంలో చిన్నారులు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శన దేవస్థానం ఆహ్వానం మేరకు ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.

– సత్యంన్యూస్, సోంపేట

## గాంధీమందిరంలో గరిమెళ్ల జయంతి వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో ప్రజా చైతన్యపు బావుటాగా గరిమెళ్ల పాట నిలిచిందని ప్రవచనకర్త నిష్టల నర్సింహమూర్తి, ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, గాంధీ స్మారక నిధి కన్వీనర్ ఎం.ప్రసాదరావు పేర్కొన్నారు. నగరంలోని గాంధీమందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో ప్రజాకవి గరిమెళ్ల 132వ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గరిమెళ్ల విగ్రహానికి కొంక్యాన గోవిందరాజుల ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్, కొంక్యాన తేజస్విని కుటుంబీకులు పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తన పాటలతో స్వాతంత్ర్య స్ఫూర్తిని గ్రామగ్రామాల్లోనూ పెంపొందిస్తూ గరిమెళ్ల చేసిన పోరాటం అసామాన్యమైనదన్నారు. మా కొద్దీ తెల్లదొరతనం దేవా అంటూ బ్రిటీష్ వారిపై ఎక్కుపెట్టిన గరిమెళ్ల వాగ్బాణాలు భాష తెలియని తెల్లవారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించాయన్నారు. దేశం కోసం తన జీవన పర్యంతం పనిచేసిన గరిమెళ్ల స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఆర్థికంగా ఎంతో ఇబ్బందులు ఎదుర్కొని జీవితాన్ని ముగించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గరిమెళ్ల జయంతిని అధికారికంగా నిర్వహించి ప్రభుత్వం తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. అనంతరం విగ్రహ దాతలు కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు బృందాన్ని గాంధీమందిర నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో గాంధీమందిర ప్రతినిధులు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, నటుకుల మోహన్, నక్క శంకరరావు, పందిరి అప్పారావు, ఎంఎస్-ఎస్ గుప్తా, పెంకి చైతన్యకుమార్, సువ్వారి రాజారావు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



## యువ రచయితల వేదిక 11వ నెల సమావేశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




జిల్లా కేంద్ర గ్రంధాలయంలో తంగి ఎర్రమ్మ అధ్యక్షతన యువ రచయతల వేదిక 11 నెల సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సభ్యులందరు చర్చించుకొని ఏకగ్రీవంగా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇందులో యువ రచయతల వేదిక గౌరవ అధ్యక్షులుగా సూరంగి మోహనరావు, బలివాడ మల్లేశ్వంరావు, డి.విష్ణుమూర్తి, కర్నెని జనార్ధనరావు, తలగాన లింగరాజు, బి.నాగభూషణరావులు ముఖ్య సలహాదారులుగా గుడిమెట్ల గోపాలకృష్ణ, అధ్యక్షురాలుగా తంగి యర్రమ్మ, ప్రధాన కార్యదర్శిగా బలివాడ ధనుంజయరావు, సహాధ్యక్షులుగా కిళ్ళనా శ్రీనివాసరావు మండల గణస్వామి, ఇప్పిలి భాస్కరరావు, జంద్యాల శరత్‌బాబు ఉపాధ్యక్షులు పెద్దింటి ముఖుందరావు, పొట్నూరు మాలతి, మహిళ కార్యదర్శిగా పెడడా వేదవతి, కార్యదర్శిగా జి.సంతోష్, కె.వాసవి, తులాల సవరమ్మా,, సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా సోడవరం ఈశ్వరరావుతోపాటు మరికొంతమంది యువ రచయితల సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కవులు తమ తమ కవితలు చదివి వినిపించారు. అనంతరం తంగి ఎర్రమ్మ మాట్లాడుతూ యువ రచయితలంతా వేదికను మనందరిదిగా భావించి ముందుకు నడపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి సభ్యులంతా నివాళులర్పించారు. సుమారు 700 సినిమాలలో నటించి చిత్రసీమలో తన ఉనికిని చాటుకున్న కోట శ్రీనివాసరావు మన మధ్యన లేకపోవడం బాధాకరమన్నారు.

## రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి




(సత్యంన్యూస్, మెళియాపుట్టి)

కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్ పై ఎన్ఐఏ పోలీసులు అక్రమంగా కేసు బనాయించి గత రెండేళ్లుగా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జైల్లో నిర్బంధించారని దీనిని నిరసిస్తూ ఈనెల 19 నుంచి ఒంగోలులో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క క్రిష్ణయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు మండలం సూర్జిని గ్రామంలో సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క. కృష్ణయ్య, జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకర్‌లు మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి ప్రజల హక్కుల కోసం పోరాడుతు, ఆకలి, అంటరానితనం లేని సమాజం కోసం నిరంతరం పోరాటం చేసి దళిత, పిడితుల పక్షంగా నిలబడిన దుడ్డు ప్రభాకర్ ను అక్రమంగా అరెస్టు చేసి గత రెండు సంవత్సరాలుగా జైల్లో నిర్బంధించడం అన్యాయమన్నారు. వెంటనే దుడ్డు ప్రభాకర్ ను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోత ధర్మారావు, బీసీ సంఘం నాయకుడు లోక్కోజీ కేశవరావు, ఇప్పిలి రామారావు, సింహాద్రి, పీతంబరం, రాము, తులసిదాసు, రంగారావు, సీతమ్మ, జానకిమ్మ, రాములమ్మ, నాగమ్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, శారీరక దారుఢ్యాన్ని పెంపుదల చేసేందుకు క్రీడలు దోహదపడతాయని వాకర్స్ ఇంటర్నేషనల్-102 జిల్లా గవర్నర్ కొంక్యాన మురళీధర్, జేసీఐ మెంటార్ నటుకుల మోహన్ అన్నారు. సాయిబాబా హేమంత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నగరంలోని మున్సిపల్ వైఎస్సార్ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్‌టెస్ట్ కార్యక్రమానికి వీరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో 26మంది విద్యార్థులు ఎంపికైనట్టు అకాడమీ ప్రధాన శిక్షకులు వై.హేమంత్న్ మార్యాదవ్ తెలిపారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ధర్మశాస్త్రా ట్రస్టు అధ్యక్షులు బరాటం సంతోష్, మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ విజయకుమార్, మాస్టర్లు డి.హరీష్, తాడివలస శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం బెల్ట్ టెస్ట్‌లో ఎంపికైన విద్యార్థులకు బెల్ట్‌లు అందజేశారు. తొలుత క్రీడాకారులు డెమో ప్రదర్శించారు.



## ఆమదాలవలసలో సుపరిపాలన

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆముదాలవలస మున్సిపాలిటీ 8వవార్డ్‌లో కూటమి ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవి కుమార్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్ యాదవ్, మున్సిపాలిటీ ఎక్స్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత విద్యాసాగర్, పిఎసిఎస్ చైర్మన్ మాధవి, బోయిన సునీత, బోర గోవింద్, టీడీపీ మండల అధ్యక్షులు నూకరాజు, టీడీపీ నాయకులు, అధికసంఖ్యలో కార్యకర్తలు యువత, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయిలో మెరిసి విజేతలుగా తిరిగిరండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న డిఎస్ఎ స్విమ్మింగ్ పూల్ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక నిర్వహించామని స్విమ్మింగ్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.ఎస్.వి.ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిపుణులు ఆధ్వర్యాన పారదర్శకంగా క్రీడాకారుల ఎంపిక జరిగిందన్నారు. విశాఖలో జరగనున్న పోటీలకు వీరంతా అర్హత సాధించారన్నారు.ఆ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులు, నేషనల్‌కు అర్హత సాధిస్తారన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో మెరిసి, విజేతలుగా తిరిగివచ్చి విజయఢంకా మ్రోగించాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథులుగా డిఎస్డీఓ శ్రీధర్, ఏసీబీ సిఐ భాస్కర్, ఉపాధ్యక్షులు రాజారత్నం, ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు, కోచ్ మురళి, కోశాధికారి జాన్సీ, క్రీడాకారులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.





# అన్ని పాత్రలూ ఆయన 'కోటా'లోకే..!




'గవర్నమెంట్ హాస్పిటల్‌లో నేలమీద పడుకున్న పదిమంది పేషంట్స్‌లో ఒకడిగా పడుకోవాలి.. ఒకేనా' అంటే.. 'ఇదే సినిమాలో పవర్‌ఫుల్ పొలిటీషియన్‌గా పాత్ర ఇచ్చారు.. అప్పుడు అడగలేదే ఇలా' అని అడిగారుట కోట శ్రీనివాసరావు. ఇది నటనకి ఆయనిచ్చే గౌరవం. ఇది పాత్రకి ఆయనిచ్చే మర్యాద. 'గణేష్' సినిమాలో పవర్‌ఫుల్ పొలిటీషియన్ సాంబశివుడు గుర్తున్నాడా.. గుండుకి విగ్గు, భయంకరంగా ఉండే కన్నుతో తెలంగాణా యాసలో సినిమా మొత్తాన్నీ చితక్కొట్టి వదిలిపెడతాడు. చూసే మనకి వీడు కనిపిస్తే చంపేయాలి అనేంత కసిని పెంచుతాడు.. ఇది కదా నటన అంటే. ప్రేక్షకులు ఇన్వాల్వ్ అయిపోయి ఇదంతా నటన, సినిమా అనేది, అది ఆ పాత్రధారి, చూసే ప్రేక్షకుడు మర్చిపోతే కరెక్ట్‌గా కనెక్ట్ అయినట్టు. గణేష్ సినిమాలో హెల్త్ మినిష్టర్ సాంబశివుడుగా అదిరే డైలాగ్స్ తనవి.. **నేను యాభైకోట్ల కుంభకోణం చేసినా.. కాదంటలే... నాకైతే చార్మినార్‌కున్నంత హిస్టరున్నది మల్ల.. అంటాడు... నిజమే కోట హిస్టరీ మామూలుగా వుండదు... అసలు తమ్మీ.. అనే మాట ఎక్కడ విన్నా గుర్తుకి వచ్చేది కోట.** 'ఖండిస్తున్నా'.. గాయం సినిమాలో డైలాగ్ ఇప్పటికీ వినిపిస్తుంది. కోటలో నటనని ఈవీవీ సత్యనారాయణ చూపించిన విధానం హైలెట్.. విలనిజానికి పరాకాష్ట 'ఆమె' సినిమా. తన ప్రతిభకి వేలెత్తి విమర్శించే అవకాశం ఇవ్వని నటుడు. నలభై ఏళ్లపాటు అందర్నీ అలరించి విశ్రాంతి అనేసిన కోట శ్రీనివాసరావు. పద్మశ్రీ తాడి మట్టయ్యా.. సెలవయ్యా??

## విలక్షణ నటనకు అతనో పెట్టని కోట!

తెలుగు సినిమాలో వచ్చిన ప్రతిభావంతమైన నటుల్లో ఒకరు కోట శ్రీనివాసరావు. ఎస్.వీ.రంగారావు తర్వాత ఆ తరహా మోల్డ్ ఉన్న నటుడు కోట శ్రీనివాసరావు.

ఏం చేస్తున్నా, ఎంత చేస్తున్నా 'అతి'లోకి పడిపోకుండా ఉండడం తెలిసిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు. (మన బ్రహ్మానందం, తమిళ్‌లో వడివేలు ఈ ఇద్దరూ కూడా ఈ కోవలోని నటులు).



రజనీకాంత్ బహిరంగంగానే కోట ప్రతిభను కొనియాడారు.

గణేశ్ సినిమాలో కోట నటన అత్యంత గొప్పగా ఉంటుంది. ప్రతిఘటన సినిమాలో ఆయన నటన అందరినీ ఆకర్షించింది. ప్రతిఘటన తమిళ్‌లో డబ్బై విజయవంతమైనప్పుడు తమిళులు కూడా కోటను మెచ్చుకున్నారు. పెర్ఫామెన్స్ అన్నదానికి ఒక ఎపిటోమ్ కోట శ్రీనివాసరావు.

నటించడం కన్నా ముందు ఆ నటనపై సరైన దృక్పథం ఉండాలి.. ఎలా నటించాలి అన్నదానిపై స్వకీయమైన ప్రణాళిక ఉండాలి. దిలీప్ కుమార్, ఎన్.టీ.రామారావు, ఎస్.వీ.రంగారావు, కమల్ హాసన్, మమ్ముట్టి, మోహన్ లాల్ వంటి నటులకు ఆ ప్రణాళిక ఉంటుంది. మన కోటకు కూడా ఆ ప్రణాళిక ఉంది. డిజైన్స్ పెర్ఫామెన్స్ కోట శ్రీనివాస్‌ది. అభినయం, ఆంగికం, వాచికం ఈ మూడింటా కోట ఒక ఆరింద.

ఎన్నో పాత్రల్లో గొప్పగా నటించారు కోట. తన తెలుగు నటనతో ఇతరుల చేత కూడా ప్రస్తుతించబడ్డారు కోట.

కోట శ్రీనివాసరావు ఒక కల్ట్ యాక్టర్. తెలుగు సినిమా ద్వారా వచ్చిన అరుదైన కల్ట్ యాక్టర్ కోట శ్రీనివాసరావు. దుష్ట, హాస్య పాత్రల పరంగా కోట శ్రీనివాసరావు కల్ట్ భారతదేశంలో మరో భాష సినిమాలో లేదు.

కోట శ్రీనివాస్ పేరుపై ఒక ప్రభుత్వ పురస్కారం అమలు చెయ్యడం సమంజసంగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ మేరకు కార్యాచరణ చెయ్యాలి.

**కోట శ్రీనివాసరావుకు స్మృత్యంజలి.**



**ఎం**తోమందికి ఇష్టమైన కోట గారు ఇవాళ చనిపోయారని తెలిసి ఏం బాధపడటం లేదు. ఆయన ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తరుణమే ఇది. నిన్నటి తరం వాళ్ళలో ఆయన ఎంతమందికి ఫేవరేట్ యాక్టరో తెలీదు. మనకు మాత్రం చాలా చాలా ఇష్టం. ఒక నటుడిగానే కాదు, ఒక తెలుగు భాషా, ప్రాంతీయ అభిమానిగా కూడా ఇష్టం. చిన్న చిన్న విలన్ పాత్రల కోసమే, కాకుండా పెద్ద పెద్ద పాత్రల కోసం కూడా పరభాషా (ముఖ్యంగా హిందీ) నటులను వాడటం ఆయన వ్యతిరేకించారు. ఏదో సినిమాలో యముడి పాత్రలో ఓ తెలుగురాని (షాయాజీ షిండే) నటుడిని పెట్టడం లాంటివి ఆయనకు ఎంతో కోపం తెప్పించేవి. తెలుగు రావడం అంటే మాట్లాడడం వస్తే సరిపోదు కదా, యముడు అంటే తెలుగువారికి పేటెంట్ ఉన్న పాత్ర లాంటిది. అలా అని ఆయనకి పరభాషా నటులు అంటే ద్వేషమో, అసూయో కాదు. 'మీరు తీసుకొస్తే ఓ ఓం పూరీని తీసుకురండి, ఓ నసీరుద్దీన్ షా, ఓ నానా పటేకర్‌ని తీసుకురండి. వాళ్ళ దగ్గర నౌకరు వేషం వెయ్యడానికి కూడా నేను సిద్ధం' అన్న గొప్ప మనిషి. అలాగే మాండలికాలను ఆయన పలికినంత చక్కగా ఇంకెవరూ పలకలేరు. లేదా, తనికెళ్ల భరణి గారికి ఎక్సెప్షన్ ఇవ్వొచ్చు. తెలంగాణా మాండలికాన్ని మొదటగా విన్నది ఆయన నోటివెంటే, ఇప్పుడు ఆన్‌గోయింగ్ తెలంగాణా మాండలికం క్రేజ్‌ను కొంతమంది ఆంధ్రా ప్రాంతపు నటులు క్యాష్ చేసుకుందామని ప్రయత్నించి దారుణంగా ఫెయిల్ అవుతున్నారు. 'క'కి బదులు 'గ' పలికితే అదే తెలంగాణా అనుకుంటున్నారు. దానికి ఓ సాధన కావాలి, పాత్ర పట్ల ఓ కన్విక్షన్ ఉండాలి. అవి రెండూ ఉన్న నటుడు కోట గారు.


పరమ దారుణ కర్కోటక నీచ నికృష్ట పాత్రలోనూ, కరుణరస పూరిత దయాహృదయుడిగానూ ఒకే రకమైన కమిట్మెంట్‌తో నటిస్తారు. రంగస్థలం నుంచి సినిమాల్లోకి వచ్చిన మనిషి కదా..

ఇక ఆయన కామెడీ చేస్తే మనం తట్టుకోలేం, హలో బ్రదర్స్ సినిమాలో ఒకవైపు మల్లికార్జునరావు గారితో కలిసి కామెడీ చేస్తూనే, క్లైమాక్స్‌కి ముందు ఆయన పండించిన నటన కళ్లలో నీళ్లు తెప్పిస్తుంది. వ్యక్తిగతంగా ఆయన్ని ఎప్పుడూ గుర్తు తెచ్చుకునే పాత్ర అత్తారింటికి దారేదిలో సిద్ధప్ప నాయుడు. నెల్లూరు స్లాంగ్‌లో ఇరగదీస్తారు.

**ఒక్కడిని కొట్టగానే నువ్వు కోరిన కొండ మీద వాన కురిసినట్టేనా.. అని హీరోని ఛాలెంజ్ చెయ్యడం దగ్గర్నుంచి. నా కూతురు పెళ్లికి వొండిన పల్లావు వాసన పదూళ్ళకు తగాలాలనుకున్యా.. ఇప్పుడు ఈ విషయం నూరూళ్ళకి తెలిసింది... ఈడి బాబు కట్నం దొబ్బే.. ఈడు నన్ను దొబ్బే.. నా బతుకు దూది కంటే చులకనా.. నీటి కంటే పలచనా అయిపోయిండ్లా...**

సెలవు కోట గారు. మీ సినిమాలు చూస్తూ పెరగడం మా అదృష్టం. మిమ్మల్ని కలవలేకపోవడం మా దురదృష్టం.

## ఆధిపత్య అహంకారాన్ని బాధతో భరించిన ఆర్టిస్టు కూడా



**ప్ర**ముఖులు ఎవరైనా మరణిస్తే.. తమ జ్ఞాపకాల్ని షేర్ చేసుకుంటూ సంతాపం ప్రకటిస్తారు కొందరు.. మరణించిన వ్యక్తి గొప్పతనాన్ని గుర్తు చేసుకుంటూ సంతాప ప్రకటనలు జారీ చేస్తారు ఇంకొందరు.. వీలైనంతవరకూ నెగెటివ్ ఇష్యూస్ పెద్దగా ప్రస్తావనకు రావు.

**కోట శ్రీనివాసరావు నిస్సందేహంగా టాలీవుడ్ అందించిన గొప్ప నటుడు. నవ్వించాడు, ఏడిపించాడు, భయపెట్టాడు.. అన్ని ఉద్వేగాలను పర్‌ఫెక్ట్‌గా ప్రదర్శించేవాడు. 750 సినిమాలు, సుదీర్ఘమైన కెరీర్.. ఎవరెవరో పరభాష విలన్లను, కేరక్టర్ ఆర్టిస్టులను తెచ్చుకుంటున్నారే తప్ప, సొంత ఆర్టిస్టులను పట్టించుకోవడం లేదనే బాధ కూడా ఉండేది తనకు కొన్నాళ్లు.**

ఆయన నటనకు పెద్ద ప్లస్ తన డిక్షన్.., తెలుగు పదాల ఉచ్చరణ తీరే సగం ఉద్వేగాన్ని పలికించేది.. అది ఏ వేషమైనా సరే.. కానీ ఈ సందర్భంగా ఓ చిన్న విషయమూ గుర్తుకు తెచ్చుకోవాలి, యాంటీ సెంటిమెంట్ అయినా సరే, అది బాధ కలిగించే సంగతి కాబట్టి.. తను జీవితంలో ఎదుర్కొన్న పెద్ద అవమానం, తనను బాగా బాధపెట్టిన సందర్భం కాబట్టి..



ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చాక సూపర్ స్టార్ కృష్ణ, మండలాధీశుడు అనే సినిమా చేశారు. అందులో కోట శ్రీనివాసరావు ఎన్టీఆర్‌ను అనుకరించే పాత్రలో నటించాడు, అందువల్ల ఎన్టీఆర్ అభిమానుల వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాడట కోట శ్రీనివాసరావు. ఆ మూవీ చేసిన కొన్ని రోజులకు కోట శ్రీనివాసరావు రాజమండ్రి షూటింగ్‌కి వెళ్లగా అక్కడ వేరే షూటింగ్ నిమిత్తం బాలకృష్ణ కూడా వచ్చాడట. ఇద్దరూ ఒకేచోట బస చేయగా, ఆయన లిఫ్ట్‌లో పై నుంచి కిందకు వస్తుంటే తాను కింద నుంచి పైకి వెళ్ళేందుకు లిఫ్ట్ కోసం ఎదురు చూస్తూ ఉండగా అక్కడ వాళ్ళందరూ కోట శ్రీనివాసరావుని తప్పుకోండి తప్పుకోండి అన్నారట.

ముందు ఆయనకు ఎందుకో అర్థం కాలేదట. అయితే **బాలకృష్ణ లిఫ్ట్‌లో నుంచి దిగుతుండగా చూసిన కోట శ్రీనివాసరావు బాలకృష్ణకి నమస్కారం పెడితే బాలకృష్ణ.. కోట శ్రీనివాసరావు ముఖం మీద కాండ్రించి ఉమ్మేసాడట.**

ఒక ముఖ్యమంత్రి కొడుకు, ఒక సూపర్‌స్టార్ కొడుకు తన తండ్రిని తిడితే ఎలా ప్రవర్తిస్తాడో బాలకృష్ణ అలాగే ప్రవర్తించాడు అని కోట శ్రీనివాసరావు ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. ఇప్పుడంటే తాను ఒక గొప్ప నటుడిని అని బాలకృష్ణ కూడా అంటున్నారనీ కానీ, ఒకప్పుడు మాత్రం ఇలా ఆయన చేతిలో అవమానం పొందానని కోట శ్రీనివాసరావు ఒక ఇంటర్వ్యూలో వెల్లడించాడు.

ఇందులో కొన్ని అంశాలు.. సౌత్ ఇండస్ట్రీ హీరోలకు ఇండస్ట్రీలో మిగతా ఆర్టిస్టులు ఎలా అణిగిమణిగి ఉండాలో చెప్పే ఓ ఆధిపత్య వాతావరణం.. నా బ్లడ్డు నా బ్రీడు అనే బాలకృష్ణ వంటి నటుల అహం.. ఓ సీనియర్ నటుడిని కేవలం తన తండ్రిని పోలే ఓ కేరక్టర్ వేశాడని ధూత్కరించడం, ఆ సీన్ ఊహిస్తేనే అదోలా ఉంటుంది..

**కోట శ్రీనివాసరావు చేసిన తప్పేముంది..? తను ఆర్టిస్టు.. తనకు వచ్చిన పాత్ర అది. ఐనా వార్త గానీ, విశ్లేషణ గానీ, కార్టూన్ గానీ, సినిమా గానీ.. ఓ పొలిటికల్ సెటైర్ తప్పెలా అవుతుంది..? అదీ అర్థం చేసుకునే స్థితి లేదు ఆనాడు.**

ఒక్కసారి ఆర్జీవీ చేసిన పొలిటికల్ సినిమాలు గుర్తుతెచ్చుకోండి. ఆ పాత్ర చేస్తే అది ఎన్టీయార్ పట్ల గానీ, ఆ పార్టీ పట్ల గానీ ఆ పాత్రధారి ద్వేషంగా, వ్యక్తిగత ఉద్దేశంగా ఎలా పరిగణిస్తారు..? అప్పట్లో సూపర్ స్టార్ కృష్ణ అదేకాదు, మరికొన్ని సినిమాలూ తీశాడు ఎన్టీయార్ పాలన మీద సెటైర్లు, విమర్శలు.. ఆ మండలాధీశుడు సినిమాలో రామోజీరావు పాత్ర కూడా ఉన్నట్టు గుర్తు. ఒక్క కోట మాత్రమే, అదీ ఎన్టీయార్ వేషం వేశాడు కాబట్టి టార్గెట్ అయ్యాడు. ఓ దశలో దాడి ప్రయత్నాలూ జరుగుతాయని తను భయపడ్డాడంటారు.

**నిజం.. కోట శ్రీనివాసరావు ఒక వర్గం తీవ్ర ద్వేషాన్ని, ఘోర అవమానాల్ని భరించాడు. ఆ రేంజ్ అవమానం ఎదుర్కొన్న మరో తెలుగు నటుడు లేడేమో, ఉండరేమో.. నిందల్ని తుడిచేసుకుని, అలాగే స్థిరంగా ఇండస్ట్రీలో నిలబడ్డాడు..**

నోటుకూ, జేబుకూ మధ్యనున్న బంధం లాంటిది.. పిసినారిగా కోట పరకాయ ప్రవేశం!

ఎస్వీఆర్, కైకాల స్థాయి నటులు.. ఆ మహానటులిద్దర్నీ చిన్నబుచ్చడం కాదుగానీ.. ఈయన వాళ్ళకంటే ఇంకొక్క అడుగు ముందుకేసి తెలుగులో అన్ని యాసలనీ పట్టుకోవడమేగాక, వేరెవరూ ఈయనంత సమర్థవంతంగా పట్టుకోలేరని పేరు తెచ్చుకోవడం మామూలు విషయం కాదు..

మా తరం చూసిన నటుల్లో తెలుగుతెరకు లభించిన గొప్ప వరం కోట శ్రీనివాసరావుగారంటే ఏమాత్రం సందేహం అక్కర్లేదు..

తెర మీద చూస్తే మనింట్లో వ్యక్తి ప్రవర్తిస్తున్నట్టో లేక మనతో మాట్లాడుతున్నట్టో ఉంటుంది తప్ప నటిస్తున్నట్టుండదు..

శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూపులో మోకాళ్ళ దాకా నిక్కరేసుకుని ఊరూరా తిరిగే ఎల్ల పాపారావు ద్రే...య్.. అంటూ అదిలిస్తుంటే మనకెందుకో కితకితలు పెట్టినట్టు ఉండదా..??

యాండే..య్ అని ఎటకారంగా పంచులేసే పెద్దమనిషిని జూస్తే అమ్మహా కంకహా ఐపోదా..??

ఈడెవండీ బాబో అంటూ నోట్లో చుట్టతో నెత్తిమీద చేతులేసుకుని విసుక్కునే శత్రువు, కళకి, కలకి తేడా చెప్పే 'సురభి' సుబ్రహ్మణ్యం గారు, మహేష్తో బేరాలాడే బాజిరెడ్డి, ఇడియట్ చంటిగాడి భవిష్యత్ కోసం కన్నీళ్లు పెట్టుకునే తండ్రి వెంకటస్వామి, మామగారు సినిమాలో బావమరిదితో బయటకి గెంటించుకుని అరుగు మీద సెటిలయ్యి బిచ్చగాడితో పొద్దుపుచ్చే మామగారు పోతురాజు, (కోట – బాబూమోహన్... ఏం కాంబినేషనండీ! పాయా వంగడం, కోట కిక్కడం – మనం ఫక్కుమనడం..) మొత్తా తగాదాలకి కారణమయ్యే గాయం గురునారాయణ్, జనాలు పెద్దగా గుర్తించని పంజరంలో విలను.. వీళ్లంతా ఎవరు బాబూ ఎవరూ..?? కోట గారే కదండే..

ఇయ్యన్నీ పక్కనబెడదామండీ..

వెంకటేష్ నటించిన గణేష్‌లో ఆరోగ్యశాఖ మంత్రి సాంబశివుడులా భయపెట్టినా.. ఆడవారి మాటలకు అర్థాలే వేరులేలో అదే గణేష్ అనబడే వెంకటేష్‌కి తండ్రిలా ఏడిపించినా అది కోటగారే కదా.. సత్యంలో ఒద్దికైన అంకిత, బొమ్మరిల్లు అల్లరి హాసిని రెండూ జెన్నీయే.. ఒప్పుకుంటాం.. కాని ఇద్దరికీ బాధ్యతాయుతమైన తండ్రి కోటనే..!!

ఇక అసలు సిసలువైన డబ్బే పరమావధిగా బతికే ఆ నలుగురు కోటయ్య, కోడల్ని వేధించే పిసినారి 'ఆమె' మామ శ్రీనివాసరావు, ఇక ఎవర్‌గ్రీన్ అహనా పెళ్ళంట పీనాసి లక్ష్మీపతి..

ఇయ్యన్నీ ఏంటి మేష్టారూ.. మిమ్మల్నే..!!

**అసలు ఆ మాటకొస్తే పిసినారి పాత్రలకి, కోటగారికి ఉన్న సంబంధం నోటుకి, జేబుకి మధ్య సంబంధం లాంటిది.. రెండూ కలిస్తే ఆ పాత్ర లెవలే వేరూ..!! ఈ పాత్రల్ని కోటగారితో వేయించిన జంధ్యాల గారి తర్వాత కోడిరామకృష్ణగారు, ఈవీవీగారు వాడుకున్నట్టు ఇంకెవరూ వాడుకోలేదేమో అనిపిస్తుంది ఆ క్యారెక్టర్లని చూస్తే.. కానీ ఆయా దర్శకులు తెలుగుతెరని తొందరగా వదిలెల్లిపోవడం కోటగారి స్టైల్లోనే చెప్పాలంటే 'ఏం చేస్తాం.. బ్యాడ్ టైం..!!'**

ఇన్ని కాదండే.. సినిమా ఏదైనా సీన్ ఏదైనా దర్శకుడెవరైనా గానీ.. రౌద్రం, ఆవేశం, హాస్యం, మందహాసం, మానవత్వం, పెద్దరికం, పేథాసు ఏదైనా సరే అవలీలగా పలికించేస్తారు కాబట్టే కోటలాంటి కీర్తి మాత్రం 'కోట'గట్టుకుని కూర్చుంది..

ఒక్కముక్కలో జెప్పాలంటే.. వి..ల..క్ష..ణం అనే మాట గనుక ఇస్త్రీ చొక్కా తొడుక్కుని, పంచె కట్టుకొస్తే ఎలా ఉంటుందో అదీ కోటగారు..!!

**ఆఖరిగా, ఆయన ట్రేడ్ మార్క్ నవ్వుని మనకి మిగిల్చి వెళ్ళిపోయిన కోటగారికి ఘననివాళులతో..??**

- ముచ్చట సౌజన్యంతో..



లక్ష్య సాధన దిశగా కష్టపడితే

# విజయం సొంతం

☆ఎమ్మెల్యే గొండు శంకర్

☆మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యువత లక్ష్యసాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తే ఎంతటి కష్టతరమైన పని అయినా విజయం వరిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. దాదాపు 10 ప్రైవేట్ కంపెనీలు 475 ఉద్యోగాల భర్తీకి పాల్గొన్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ జాబ్‌మేళాకి ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖమంత్రి నారా లోకేష్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచెన్నాయుడు యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నారన్నారు. జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి సాయికుమార్ మాట్లాడుతూ జాబ్ పొందినవారు అవకాశాన్ని విడిచిపెట్టకుండా జాయిన్ అయి కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, సీనియర్ నాయకులు టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు రెడ్డి గిరిజాశంకర్ టీడీపీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి, తెలుగుదేశం సీనియర్ నాయకులు ఎందు చిన్నారావు, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఇగోల బందిఖానాలో వైకాపా!

(మొదటిపేజీ తరువాయి)

సాక్షాత్తు ధర్మాన ప్రసాదరావే. తాను పార్టీ మారుతానన్న ప్రచారాన్ని ఆయన మొన్నటి వరకు ఎక్కడా ఖండించలేదు. ఈ కథనాలు పార్టీ అధిష్టానం వరకు చేరితే తన డిమాండ్లకు ఒప్పుకుంటారన్నది ఆయన ఉద్దేశం కావచ్చు. కానీ దానికి ముందు జరిగిన జిల్లా వైకాపా విస్తృతస్థాయి సమావేశానికి ఊహించని విధంగా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ హాజరయ్యారు. వాస్తవానికి ఆయన గతంలో మాదిరిగా రీజనల్ కోఆర్డినేటర్ గానీ, పార్టీ పరిశీలకుడు గానీ కాదు. జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంటరీ పార్టీ పరిశీలకుడు కుంభా రవి బాబు, ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి కురసాల కన్నబాబు ఈ సమావేశానికి విచ్చేసినా ధర్మాన ప్రసాదరావు మాత్రం రాలేదు. ఆ తర్వాత పార్టీకి ఏం మెసేజ్ వెళ్లిందో.. ధర్మానకు ఏమేరకు తత్వం బోధపడిందో తెలీదు గానీ అనారోగ్య కారణాల వల్ల తాను పార్టీ నిర్దేశించిన కార్యక్రమాల్లో పాల్గోలేకపోయానని, జిల్లాకు టీడీపీ మోసం చేసిందంటూ 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'లో చెప్పుకొచ్చారు.

**మారుతున్న రాజకీయం**

వైకాపాలో కొద్ది నెలలుగా రాజకీయం వేగంగా మారిపోతోంది. జగన్మోహన్‌రెడ్డి వ్యవహార శైలిలో కూడా స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. మరోవైపు వైకాపాలో గతంలో దూకుడుగా వ్యవహరించిన నేతలు ఇంకా తమను ఎందుకు ప్రభుత్వం అరెస్ట్ చేయలేదన్న కోణంలో బహిరంగంగానే బాబు కూటమికి బాధ కలిగించే విధంగా మాట్లాడుతున్నారు. మాజీమంత్రి పేర్ని నాని స్టేట్‌మెంట్లు చూస్తే ఇది అర్థమవుతుంది. మరో మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ కూడా అరెస్టుకు తగ్గేదే లే అన్నట్లు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. అధికార కూటమి ఎవరిని నిర్బంధిస్తోందో వారికి జగన్మోహన్‌రెడ్డి కచ్చితంగా అగ్రతాంబూలం ఇస్తారన్న భావన ఇప్పటికే విజయవాడ సర్కిల్స్‌లో తిరుగుతోంది. మరోవైపు గతం మాదిరిగా కాకుండా జిల్లాలవారీగా వైట్‌బుక్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని జగన్మోహన్‌రెడ్డి పార్టీ నాయకులకు సూచిస్తున్నారు. మరో ఆరు నెలల తర్వాత కచ్చితంగా పార్టీలో మార్పులు, చేర్పులు ఉంటాయని, ఈలోగా అలకబూనినవారు, తెరమరుగైనవారు ఎంతమంది ఉన్నారో తెలుసుకునేందుకు బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని ప్రాతిపదికగా తీసుకున్నట్లు తెలుస్తోంది. రాబోయే ఎన్నికల్లో కూడా కూటమి మీద వ్యతిరేకత, జగన్మోహన్‌రెడ్డికి ఉన్న మాస్ ఇమేజ్ మేరకు అధికారంలోకి వస్తారనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంకా మెట్టు దిగకపోవడం సరికాదన్న భావన ధర్మానకు కలిగి ఉంటుంది. లేదా పార్టీయే బొత్స సత్యనారాయణను శ్రీకాకుళం మీద ఓ కన్నేసి ఉంచమని చెప్పిందన్న సంకేతం ధర్మానకు తెలిసి ఉండవచ్చు. కారణమేదైనా సత్తిబాబు రాకతో ధర్మాన అడుగు ముందుకు పడింది. అయితే పార్టీలో పెద్ద నాయకులు మాత్రం ఇగోలు వీడినట్లు కనిపించడంలేదు.

# గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర మాజీమంత్రి, తెలుగుదేశం సీనియర్ నాయకుడు పూసపతి అశోక్‌గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడు రాష్ట్రాలకు గవర్నర్ల నియామకంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆయనతోపాటు హర్యానా గవర్నర్‌గా ప్రొఫెసర్ అషీం కుమార్ ఘోష్, రాజీనామా చేసిన లడ్డాక్ గవర్నర్ బి.బి.శర్మ స్థానంలో కవిందర్ గుప్తాను ఆ కేంద్ర పాలిత ప్రాంతానికి గవర్నర్‌గా నియమించారు. తెలుగుదేశం పార్టీలో ప్రస్తుతం ఉన్న నాయకుల్లో అత్యంత సీనియర్ అయిన అశోక్‌గజపతిరాజు.. పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యుడితోపాటు అనేక పదవులు నిర్వహించారు. రాష్ట్రమంత్రిగా, కేంద్ర మంత్రిగా కూడా సుదీర్ఘకాలం పనిచేశారు. విజయనగరం రాజవంశానికి చెందిన ఆయనకు నిస్వార్థ రాజకీయ నేతగా గుర్తింపు ఉంది. 2024 ఎన్నికల్లో రాజకీయంగా రిటైర్‌మెంట్ తీసుకున్న ఆయన తన వారసురాలిగా కుమార్తె అదితి గజపతిరాజును తీసుకొచ్చారు. ఆమె విజయనగరం నుంచి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న అశోక్‌కు పార్టీ అధినేత చంద్రబాబు ఏదో ఒక ఉన్నప పదవి ఇస్తారని చాలారోజులుగా ప్రచారం జరుగుతోంది. తెలుగుదేశం ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నందున ఆ కోటాలో ఒకటిరెండు గవర్నర్ పదవులు టీడీపీకి ఇస్తారని, అందువల్ల అశోక్‌ను గవర్నర్‌గా పంపవచ్చని చాలా రోజులుగా ప్రచారం జరుగుతోంది. దాన్నే నిజం చేస్తూ తాజాగా కేంద్రం జరిపిన గవర్నర్ల నియామకంలో అశోక్‌గజపతిరాజుకు అవకాశం లభించింది.

# వృద్ధిరాలిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం సబ్ డివిజన్ శ్రీకాకుళం ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో పరిధిలో ఈ నెల 9న రాత్రి హయతినగర్, బాలాజీనగర్‌లో వృద్ధిరాలిపై దాడి చేసి మెడలోని బంగారు తాడును తెంపి దోపిడీకి పాల్పడిన జీరు సురేష్‌ను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం వెంకటాపురం సింహద్వారం వద్ద శ్రీకాకుళం రూరల్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్, పోలీసు సిబ్బంది అరెస్టు చేసినట్లు తెలిపారు. వృద్ధురాలి నుంచి దొంగిలించిన కేసు సొత్తు బంగారం తాడు (35.70 గ్రాములు) స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

ముద్దాయి జీరు సురేష్ చెడు వ్యసనాలకు లోనై అప్పులు చేసి తీర్చలేక దొంగతనాలకు అలవాటు పడి పొడుగు ఆరుద్రమ్మ ఇంటిలోనికి ప్రవేశించి మంచినీరు కావాలని అడిగి, ఆమె వెనుకకు తిరిగే సరికి ఆమెపై దాడిచేసి, మెడలోని బంగారు తాడు బలవంతంగా తెంపి పారిపోయాడు. 2025 మే నెలలో పి.న.కాలనీలో స్నేహితునితో కలసి ఎలక్ట్రికల్ సామానులు, టివీ, ల్యాప్‌టాప్, బంగారు ఆభరణాలు, రూ.50వేలు నగదు దొంగిలించిన కేసులో 2వ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి అంపోలు జైలుకు పంపగా, ప్రస్తుతం బెయిల్‌పై వున్నాడు.

బంగారం తాడు చోరీ కేసు విషయంలో శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద పర్యవేక్షణలో ప్రతిభ కనబర్చిన శ్రీకాకుళం రూరల్ సీఐ కే.పైడపునాయుడు, ఎస్సై ఎం.హరికృష్ణ, శ్రీకాకుళం వన్ టౌన్ పీసీఎస్ రవికుమార్, రమణమూర్తి, భాస్కరరావు, జగదీశ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# చెరువులో ఆక్రమణలు తొలగించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గార మండలం అంపోలు రెవెన్యూ పరిధిలో ఉన్న సానివాడ బరాటం చెరువులో ఆక్రమణలను తొలగించాలని సర్పంచ్ రుప్ప లక్ష్మీ ఉన్నతాధికారులకు విన్నవించారు. సోమవారం జెడ్పీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో డీఆర్‌వో వెంకటేశ్వరరావుకు వినతి అందించి చర్యలు తీసుకోవాలని కోరారు. సుమారు 10 ఎకరాల చెరువు గర్భాన్ని ఆక్రమించి వారసత్వ భూమిగా చూపిస్తున్నారని వివరించారు. వారి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోయినా ఆక్రమణలను తొలగించడానికి వచ్చిన అధికార యంత్రాంగంపై దౌర్జన్యానికి దిగుతూ ఉపాధి పనులు అడ్డుకుంటున్నారని వివరించారు. చెరువులో 10 ఎకరాలు దురాక్రమణకు గురికావడంతో ఆయకట్టుకు నీరందడం లేదని తెలిపారు. తక్షణమే స్పందించి చెరువు గర్భంలో ఆక్రమణలను తొలగించాలని కోరారు.



# మడం తిప్పిన టీడీపీ.. మౌనం వహించిన వైసీపీ!

**ప్రకాశం జిల్లాలో ప్రతిపాదిత ఐడోసోల్ సౌర విద్యుత్ ప్రాజెక్టు ఇప్పుడు అధికార తెలుగుదేశం పార్టీకి తలనొప్పిగా మారింది. గతంలో ఈ ప్రాజెక్టును "బోగస్ కంపెనీ"గా టీడీపీ విమర్శించిందని, అధికారంలోకి వచ్చాక వేల ఎకరాల సారవంతమైన భూములను బలవంతంగా సేకరించడానికి సిద్ధమవుతోందని రైతులు అంటున్నారు. మరోవైపు, వైసీపీ హయాంలోనే ఈ ప్రాజెక్టుకు బీజం పడినప్పటికీ, ప్రస్తుత నిరసనలపై ఆ పార్టీ మౌనం వహించడం అనేక రాజకీయ వ్యూహాలు, ప్రశ్నలకు తావిస్తోంది. కరేడు గ్రామంలో రైతులు "భూమి ఇవ్వం, ప్రాణం ఇస్తాం" అంటూ చేపట్టిన నిరసనలతో ఈ వివాదం రోజురోజుకూ ముదురుతోంది.**

2022లో వైసీపీ హయాంలో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. కానీ, 2025లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం దీనిని వేగంగా ముందుకు తీసుకువెళ్లడం మొదలుపెట్టింది. జూన్ 2025లో ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయం భూసేకరణ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఐడోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ హైదరాబాద్‌కి చెందిన ప్రైవేట్ కంపెనీ. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీలో పలు ప్రాజెక్ట్‌లను దక్కించుకున్న , శిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ అనే కంపెనీకి ఈ సంస్థ అనుబంధమైనది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం సుమారు రూ.4,200 కోట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 1,500 మెగా వాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయబోతున్నట్లు తెలుస్తోంది. దీంతో రాష్ట్ర విద్యుత్ అవసరాల ఒత్తిడిని తగ్గించడంలో ఉపయోగపడుతుందని ప్రభుత్వం చెబుతోంది.

**కంపెనీ మీద విమర్శలు..**

అయితే, గతంలో ఇలాంటి భారీ స్థాయి ప్రాజెక్టులను ఏర్పాటు చేయడంలో ఈ కంపెనీకి ఎటువంటి అనుభవం లేదనే విమర్శలు వినిపిస్తోన్నాయి. పైగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ అనుమతులు, సామాజిక ప్రభావాల అధ్యయనాలు, ఆర్థిక ప్రయోజనాలపై సరైన వివరాలు ఇప్పటివరకు ప్రభుత్వం బయటపెట్టలేదు. ఇదంతా ప్రాజెక్టుపై పలు అనుమానాలు పెంచుతోంది. మొదట 4,855 ఎకరాల భూమిని లక్ష్యంగా పెట్టుకున్నా, తర్వాత ఇది 8,500 ఎకరాలకు పెరిగింది. ఈ భూముల్లో చాలా భాగం సంవత్సరానికి మూడుసార్లు పంటలిచ్చేవే ఉన్నాయి. దీంతో ఈ ప్రక్రియ మొదలైన దగ్గర నుంచే రైతులు తీవ్ర వ్యతిరేకత చూపుతున్నారు.

తమ మూడు పంటల భూములను బలవంతంగా తీసుకుంటున్నారని ఎస్సీ, బీసీ, ఇతర పేద వర్గాల రైతులు ఆరోపిస్తోన్నారు. ప్రభుత్వానికి నిజంగా భూమి అవసరమైతే పంటలు లేని ప్రాంతాల్లో భూమి తీసుకోవచ్చు కదా అని ప్రశ్నిస్తున్నారు. 2025 జూన్ 29న వేల మంది రైతులు ఉలవపాడు దగ్గర జాతీయ రహదారి 16ను దిగ్బంధించారు."భూమి ఇవ్వం, ప్రాణం ఇస్తాం" అంటూ నినాదాలతో హోరెత్తించారు. మహిళలు, పిల్లలు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. పోలీసు అరెస్టులతో ఉద్రిక్తత పెరిగింది. కానుకూరు ఉప కలెక్టర్ జోక్యం చేసుకుని భూసేకరణను తాత్కాలికంగా ఆపుతూ, రైతులతో చర్చకు సిద్ధమయ్యారు.

**రైతులెందుకు వ్యతిరేకిస్తున్నారు?**

ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను రైతులు తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. భూసేకరణ చట్టబద్ధంగా జరగడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామసభ అనుమతి లేకుండా భూమిని తీసుకుంటే అది చట్టానికి వ్యతిరేకం. 2013లో వచ్చిన భూసేకరణ చట్టం ప్రకారం, పేదల భూమిని తీసుకునే ముందు గ్రామస్థాయి చర్చలు జరగాలి. కానీ కరేడు వ్యవహారంలో అలాంటిదేమీ జరగలేదని రైతులు చెబుతున్నారు. ప్రాజెక్టుకు భూమి అవసరమైతే పోడి భూములు, పాడుబడిన భూములు ఎన్నో ఉన్నాయి. కానీ ప్రభుత్వం ఎందుకు బలవంతంగా మూడు పంటలు పండుతున్న భూములనే తీసుకోవాని చూస్తోందని ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టు చేపట్టబోయే ఐడోసోల్ కంపెనీకి దేశంలో ఇంతకు ముందు ఇలాంటి పెద్ద ప్రాజెక్టులు చేసిన అనుభవం లేదని అలాంటి కంపెనీకి ప్రభుత్వం ఏ ఉద్దేశంతో ఇలాంటి మూడు పంటలు పండే భూములు ఇవ్వడానికి రెడీ అవుతోందని రైతులు అడుగుతున్నారు. గతంలో ఇదే ప్రాజెక్ట్‌పై విమర్శలు చేసిన టీడీపీ నేతలు ఇప్పుడు అధికారంలోకి రాగానే ఎలా ఆ కంపెనీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు.

వైసీపీ హయాంలో ఈ ప్రాజెక్ట్ మొదలైందే కానీ భూసేకరణ జరగలేదు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చి అదే ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. గతంలో టీడీపీ ఐడోసోల్ సంస్థపై విమర్శలు చేసింది. ఇప్పుడు అదే టీడీపీ అదే సంస్థతో ప్రాజెక్టు నిర్వహిస్తోంది. ఇది రాజకీయ అస్పష్టతకే నిదర్శనమనే విమర్శలు అన్ని వైపుల నుంచి వస్తున్నాయి.

**వైసీపీ పాత్ర- ప్రాజెక్టు ప్రారంభం..**

ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రాజెక్ట్ ను సీపీఎం, ఆప్, కాంగ్రెస్, రైతు సంఘాలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నాయి. భూసేకరణ వివరాలు, పరిహారం, పునరావాస ప్రణాళిక గురించి పూర్తిగా చెప్పకుండా ఎలా భూసేకరణకు నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేస్తుందని ప్రశ్నిస్తున్నారు. రైతులు ఇంత తీవ్ర స్థాయిలో ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ, ఆందోళన చేస్తున్నారు. అయినా ప్రాజెక్ట్‌పైన కానీ రైతుల పట్ల కానీ ప్రతిపక్ష వైసీపీ ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో, ఇండోసాల్ (అనుబంధ సంస్థ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్)తో ఈ ప్రాజెక్ట్ కోసం ఒప్పందాలు చేసుకుంది. 2023 మార్చిలో విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఇండోసాల్‌తో అవగాహన ఒప్పందాలు(ఎంఓయూఎస్) కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందాల ద్వారా, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల కోసం ఇండోసాల్‌కు సుమారు 25,000 ఎకరాల భూమిని కేటాయించడానికి సంబంధించిన ప్రాథమిక చర్చలు, ఆమోదాలు జరిగాయి. ఇందులో భాగంగా ఇండోసాల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 7200 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుల కేటాయిస్తూ జీవో నెం 19ను 2022 సెప్టెంబర్ 12నన జారీ చేసింది. దీంతో అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ఈ ప్రాజెక్టను వ్యతిరేకించింది. ఒక బోగస్ కంపెనీకి ఎలా అన్ని వేల ఎకరాలు కట్టబెడతారని అప్పుడు రైతులకు అనుకూలంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయితే తాజాగా ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు అదే ప్రాజెక్ట్ కు అనుమతులు ఇచ్చి భూ సేకరణకు నోటీఫికేషన్లు కూడా జారీ చేసింది.

**ప్రస్తుత టీడీపీ పాత్ర - వివాదాస్పద భూసేకరణ..**

ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం 2025 జూన్‌లో భూసేకరణ నోటిఫికేషన్లను జారీ చేసింది. దీంతో కరేడుతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో భూసేకరణ కోసం ప్రణాళికలు రచించబడ్డాయి. వేల ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూములను సేకరించడానికి నిర్దిష్టంగా ప్రభుత్వం అనుమతించింది. ఇందులో భాగంగా 72, 73, 74, 75, 76 నెంబర్‌ల గెజిట్‌ను ప్రభుత్వం విడుదల చేసింది.

ఇదిలాఉంటే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇండోసాల్‌ను "బోగస్ కంపెనీ" అని విమర్శించిన టీడీపీ, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తుండటం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో, రైతులు తమ జీవనోపాధిని కోల్పోతామని ఆందోళన చెందుతూ, భూసేకరణ నోటిఫికేషన్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో, ముఖ్యంగా భూసేకరణ చట్టాల అమలు, పారదర్శకతపై తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఇదిలా ఉంటే ఇప్పటికే వచ్చిన నిరసనల నేపథ్యంలో ప్రస్తుతం భూసేకరణ తాత్కాలికంగా నిలిపివేశారు. మరో వైపు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వ్యవహారం కేవలం కరేడు రైతుల భూమికే పరిమితం కాదు. ఇది దేశవ్యాప్తంగా అభివృద్ధి పేరుతో భూములపై జరుగుతోన్న అన్యాయానికి ఉదాహరణ. పచ్చని భూములను 'గ్రీన్ ఎనర్జీ' పేరుతో తీసుకోవడం సరైనది కాదు. ప్రభుత్వం రైతులతో చర్చలు జరపకుండా ముందుకు వెళ్తే, ఈ ప్రాజెక్టు వెలుగుకు కాకుండా చీకటికి మారుపేరు అవుతుంది.

**- ద వైర్ తెలుగు సౌజన్యంతో...**

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.